# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 22-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 24వ తేదీన బీహార్ లోని భాగల్‌పూర్ నుండి పీఎం కిసాన్ సమ్మాన్ నిధులను విడుదల చేయనున్నారు.

❖ భారత ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముక వంటిదని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు.

❖ వికసిత్ భారత్ విజన్ ను విద్యార్థులు ముందుకు తీసుకువెళ్ళాలని కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విజ్ఞప్తి చేశారు.

❖ సరిహద్దు ఉద్రిక్తతలను నివారించేలా .. కాల్పుల విరమణ ఒప్పందాన్ని కొనసాగించేందుకు భారత్ పాకిస్థాన్ సైన్యాల ప్రతినిధులు అంగీకరించారు.

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపటి నుంచి మధ్యప్రదేశ్, బీహార్, అస్సాం రాష్ట్రాల్లో 3 రోజులు పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఈ నెల 24వ తేదీన బీహార్ లోని భాగల్‌పూర్ నుండి “పీఎం కిసాన్ సమ్మాన్” నిధి 19వ విడత నిధులను విడుదల చేయనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలపై అవగాహన కల్పించేందుకు నిధులు విడుదల చేసే రోజును కిసాన్ సమ్మాన్ సమరోహ్‌గా జరుపుకుంటామని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. నగదు బదిలీ ద్వారా దేశవ్యాప్తంగా 9.8 కోట్ల మందికి పైగా రైతులకు 22 వేల కోట్ల రూపాయల మొత్తాన్ని ఆర్థిక సహాయంగా అందజేయనున్నట్టు కేంద్ర మంత్రి తెలియజేశారు. బీహార్ నుండి ప్రధానమంత్రి అస్సాంకు ప్రయాణమవుతారు.

==========================

కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఈరోజు న్యూఢిల్లీలో పూసా కృషి విజ్ఞాన మేళాను ప్రారంభించారు. ఉన్నత్ కృషి - వికసిత్ భారత్ ఇతివృత్తంతో మొదలైన ఈ మేళా 3 రోజుల పాటు జరగనుంది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... భారత ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముక వంటిదని, రైతులు, వ్యవసాయం లేకుండా దేశ అభివృద్ధిని సాధించలేమని పేర్కొన్నారు. 2047 నాటికి భారత్‌ను

వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం వ్యవసాయ రంగంలో అనేక కార్యక్రమాలు చేపట్టిందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 34 సెకన్లు)

========================

ఫిబ్రవరి 2021 కాల్పుల విరమణ ఒప్పందాన్ని కొనసాగించేందుకు భారత్, పాకిస్తాన్ సైన్యాల ప్రతినిధులు అంగీకరించారు. నియంత్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఇటీవల చోటుచేసుకున్న ఘటనల తరువాత ఉద్రిక్తతలను తగ్గించడానికి ఇరు దేశాల బ్రిగేడ్ కమాండర్లు జమ్ము కశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఫ్లాగ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరిహద్దు వెంబడి శాంతి, సుస్థిరతలను కొనసాగించడానికి కాల్పుల విరమణ ఒప్పందం ప్రాముఖ్యతను ఇరుపక్షాలు స్పష్టం చేశాయి. 4 సంవత్సరాల తరువాత సుహృద్భావ వాతావరణంలో ఈ కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశం పట్ల పూంచ్ జిల్లాలోని సరిహద్దు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, యురోపియన్ కమిషన్ అధ్యక్షురాలు.. ఉర్సులా వాన్ డెర్ లేయన్‌తో ప్రతినిధి స్థాయి చర్చలు జరపనున్నట్టు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఈ నెల 27 నుంచి రెండు రోజుల పాటు భారత్‌లో పర్యటించనున్నారని, ఇందులో భాగంగా చర్చలు జరుగుతాయని ఆ శాఖ పేర్కొంది. భారత్ - ఐరోపా దేశాలు మధ్య విస్తృత స్థాయి ద్వైపాక్షిక సంబంధాలు నెలకొని ఉన్నాయి. అలాగే... 2004 సంవత్సరం నుండి ఇరు దేశాలు వ్యూహాత్మక భాగస్వాములుగా ఉన్నాయి. కాగా... యురోపియన్ అధ్యక్షురాలు భారత్‌లో చేస్తున్న ఈ 3వ పర్యటన.. ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయనుందని మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

========================

భారత్ - జపాన్ దేశాల సంయుక్త మిలిటరీ విన్యాసాల 6వ ఎడిషన్ ధర్మ గార్డియన్ లో పాల్గొనేందుకు 120 మంది సిబ్బందితో కూడిన భారత సాయుధ దళాల బృందం ఈరోజు బయలుదేరింది. ఈ నెల 24 నుండి మార్చి 9వ తేదీ వరకు జపాన్‌లోని ఈస్ట్ ఫుజి మానేవర్ ట్రైనింగ్ ఏరియాలో ఈ విన్యాసాలు జరగనున్నాయి. ఐక్య రాజ్య సమితి ఆదేశాల ప్రకారం ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను నిర్వహించేటప్పుడు రెండు దళాల మధ్య పరస్పర చర్యలను మెరుగుపరచడం లక్ష్యంగా ఈ విన్యాసాలు జరగనున్నాయి. శారీరక దృఢత్వం, ఉమ్మడి ప్రణాళిక, ఉమ్మడి వ్యూహాత్మక చర్యలపై ప్రధానంగా దృష్టి సారిస్తారు.

విరామం

========================

భారత్‌ను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు నూతన జాతీయ విద్యా విధానం ఎంతగానో దోహదపడుతుందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా నూతన విద్యా విధానాన్ని అమలు చేయడం ద్వారా వికసిత్ భారత్ 2047 లక్ష్యం నెరవేరుతుందని ఆయన ఉద్ఘాటించారు. న్యూఢిల్లీలోని ఢిల్లీ విశ్వవిద్యాలయం 101వ స్నాతకోత్సవంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ... ప్రధానమంత్రి వికసిత్ భారత్ విజన్‌ను ముందుకు తీసుకెళ్లాలని విద్యార్థులను కోరారు. దేశ జనాభాలో 60 శాతంగా ఉన్న యువతలో చాలా మంది కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో ఉన్నారని పేర్కొంటూ... ఢిల్లీ విశ్వవిద్యాలయం నూతన విద్యావిధానాన్ని అమలు చేయడాన్ని ప్రశంసించారు.

(వాయిస్ 26 సెకన్లు)

==========================

మారిషస్ దేశ 57వ జాతీయ దినోత్సవ వేడుకలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గౌరవ అతిధిగా హాజరుకానున్నారు. ఈ మేరకు మారిషస్ ప్రధానమంత్రి నవీన్ రామ్‌గూలం ఆ దేశ పార్లమెంట్‌లో ప్రకటించారు. తమ దేశ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా రావడానికి నరేంద్రమోదీ అంగీకరించారని, మోదీ వంటి విశిష్ట వ్యక్తికి ఆతిథ్యమివ్వడం మారిషస్‌కు దక్కిన గొప్ప విశేషమని రామ్‌గూలం వ్యాఖ్యానించారు. భారత్ - మారిషస్ దేశాల మధ్య ఉన్న బలమైన, శాశ్వతమైన సంబంధాలను ఆయన ప్రస్తావించారు. ప్రతి సంవత్సరం మార్చి 12వ తేదీన మారిషస్ తన జాతీయ దినోత్సవాన్ని జరుపుకుంటుంది. గత సంవత్సరం మారిషస్ జాతీయ దినోత్సవాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

==========================

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పూర్వ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రిన్సిపల్ సెక్రటరీ - 2 గా నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదించింది. శక్తికాంత్ దాస్ తమిళనాడు కేడర్‌కు చెందిన 1980 - బ్యాచ్ కు చెందిన విశ్రాంత IAS అధికారి. ఆయన ఈ పదవిలో ప్రధానమంత్రి పదవీ కాలం ముగిసే వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కొనసాగుతారు.

==========================

నేషనల్ కన్స్యూమర్ హెల్ప్‌లైన్ (NCH) కు ఫిర్యాదు చేయడం ద్వారా 600 మందికి పైగా అభ్యర్థులు, విద్యార్థులు వివిధ కోచింగ్ సెంటర్‌ల నుండి 1.56 కోట్ల రూపాయల రీఫండ్‌లను పొందారని ప్రభుత్వం వెల్లడించింది. సివిల్ సర్వీసెస్, ఇంజినీరింగ్ కోర్సులు మొదలైన వాటి కోసం కోచింగ్ సెంటర్‌లలో చేరిన అభ్యర్థులు కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు నిర్దేశించిన నిబంధనలను అనుసరించినప్పటికీ, రీఫండ్‌లను పొందలేకపోయారని వినియోగదారుల వ్యవహారాల విభాగం తెలిపింది. దీంతో విద్యార్థులు NCH కు ఫిర్యాదు చేసి, తమకు రావలసిన రిఫండ్‌లను సులభంగా పొందారని, వివాద పరిష్కార ప్రక్రియను NCH సులభతరం చేసిందని తెలిపింది. ఫిర్యాదుల పరిష్కారానికి, వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి కస్యూమర్ అఫైర్స్ డిపార్ట్‌మెంట్... కట్టుబడి ఉందని మంత్రిత్వ శాఖ ఈ సందర్భంగా తెలియజేసింది.

==========================

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా రేపు భారత్ - పాకిస్థాన్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగనుంది. దుబాయి ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగే ఈ మ్యాచ్ మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు ప్రారంభం కానుంది. కాగా బంగ్లాదేశ్‌ను ఓడించిన టీమ్ ఇండియా... రేపు జరగబోయే మ్యాచ్‌లో పాకిస్థాన్ ఓడించి సెమీ ఫైనల్ అవకాశాలను దక్కించుకోవాలని చూస్తోంది.

==========================

శ్రీశైలం ఎడమ బాంక్ కెనాల్ టన్నెల్ పైకప్పు కూలిపోవడంతో 8 మంది కార్మికులు టన్నెల్ లోపల చిక్కుకుపోయారు. తెలంగాణా రాష్ట్రం నాగర్ కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలో పనులు జరుగుతుండగా ఈ ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది. 50 మంది కార్మికులు టన్నెల్ లోపల ఉండగా ప్రమాదం జరిగి, 42 మంది సురక్షితంగా బయటకు వచ్చారు. లోపల చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు పోలీసులు, ఎన్డీఆర్ ఎఫ్ దళాలు ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి, ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.

==========================
==========================